ప్రజాశక్తి

మంగళవారం 15 నవంబర్ 2022 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



పెండింగ్‌లో రెండు బ్యారేజీల అనుమతులు

- ప్రభుత్వం వద్ద ప్రాజెక్టుల ప్రతిపాదనలు
- ఎస్ఎస్ఆర్ ప్రకారం ప్రభుత్వానికి డిపిఆర్‌లు
- నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వని సర్కార్

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

కృష్ణా నదిపై కట్టదలచిన రెండు కొత్త బ్యారేజీల నిర్మాణాలు అగమ్య గోచరంగా మారాయి. ప్రభుత్వం నాన్చుడు ధోరిణితో వ్యవహరిస్తుండటంతో ప్రతి ఏటా వందలాది టిఎంసిల నీరు వృధాగా అవుతోంది. ఈ సీజన్‌లో ఎన్నడు లేని విధంగా సుమారు 1500 నుంచి 1600 టిఎంసిల వరకు మిగులు జలాలు సముద్రంలో కలిసిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో ప్రకాశం బ్యారేజీకి వరద నీరు వచ్చి చేరడంతో కిందకు నీటిని విడుదల చేయక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. సముద్రంలో వృధాగా కలుస్తున్న వరద నీటిని వినియోగంలోకి తేవాలని వైసిపి ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా భూగర్భ నీటి శాతాన్ని పెంచుకోవడంతో పాటు సాగు, తాగు నీటికి ఉపయోగించుకోవాలని భావిస్తోంది. అందులో భాగంగా ప్రకాశం బ్యారేజీ దిగువన రెండు ఆనకట్టలు నిర్మించాలని రెండేళ్ల క్రితం నిర్ణయించింది. ప్రకాశం బ్యారేజి దిగువన 12 కిమీ దూరంలో పెనమలూరు మండలం చోడవరం వద్ద సుమారు రూ.1215 కోట్ల అంచనా వ్యయంతో 2.70 టిఎంసిల సామర్థ్యం కలిగిన ఒక ఆనకట్టను, ప్రకాశం బ్యారేజ్‌కి 62 కిమీ దిగువున మోపిదేవి మండలం బండికోళ్లంక వద్ద దాదాపు రూ.1350 కోట్ల అంచనా వ్యయంతో 4.70 టిఎంసిల సామర్థ్యం కలిగిన రెండో బ్యారేజీని నిర్మించాలని నిర్ణయించింది. అయితే మొదటి స్టేజీలో ఇన్విస్టిగేషన్ పార్టు ఉంటుంది. రెండో స్టేజీలో డిపిఆర్ తయారు చేయడం ఉంటుంది. ఈ రెండు దశలు పూర్తయిన అనంతరం నిర్మాణాలు చేపడతారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇది వరకే రెండు దశలు పూర్తి చేశారు. సర్వే పనులు, డిపిఆర్‌ల తయారీ నిమిత్తం ప్రభుత్వం సుమారు రూ. 2 కోట్ల నిధులను కూడా విడుదల (మిగతా 6లో)



కూచిపూడిలో ప్రదర్శన నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మికులు, నేతలు; అంతర్‌చిత్రంలో) సభలో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

దశమరత్నంగా భూ పంపిణీ చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు
- వ్యకాస కృష్ణాజిల్లా 2వ మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్న పథకాలు పేదరికాన్ని తగ్గించడంలేదని, ఈ నేపథ్యంలో నవ రత్నాలకుతోడు దశమరత్నంగా భూ పంపిణీ చేర్చి ప్రతి పేద కుటుంబానికీ రెండెకరాల భూమిని పంపిణీ చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. భూమి చేతిలో ఉంటేనే పది మంది ఇంటికి వస్తే అన్నం పెట్టే శక్తి పేదలకు, దళితులకు వస్తుందన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా ద్వితీయ మహాసభను పురస్కరించుకుని కృష్ణాజిల్లా మొవ్వ మండలం కూచిపూడిలోని చేబ్రోల్ భాస్కరరావు ప్రాంగణం (శాంతికాంప్లెక్స్)లో సోమవారం బహిరంగ సభ నిర్వహించారు. తొలుత పెదపూడి వంతెన సంటర్ నుంచి కూచిపూడి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు యద్దనపూడి మధు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న పేదలందరికీ పంపిణీ చేయడానికి అవసరమైన భూములున్నాయని కోనేరు రంగారావు భూ కమిటీ గతంలోనే తేల్చిందన్నారు. కొనుగోలు చేసిన వారికే భూములు దఖలుపడేలా ఎసైన్‌మెంట్ భూముల చట్ట సవరణకు ప్రభుత్వం పూనుకుంటోందన్నారు. పేదలకు పంపిణీ చేసిన భూములను కొనడం నేరమని ఎస్సైన్‌మెంట్ చట్టం చెబుతోందన్నారు. అంతేగాక కొనుగోలు చేసిన వారి నుంచి ఎస్సైన్డ్ భూములను స్వాధీనం చేసుకుని తిరిగి పేదలకు ఇవ్వాలని చెబుతోందన్నారు. ఈచట్ట సవరణ జరిగితే దళితులు, పేదలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. దళితుల చేతుల్లోని భూములు భూస్వాముల చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు. భూపోరాటాల గడ్డ దివి సీమ ప్రాంతమని, చల్లపల్లి నారాయణరావు, గుంటూరు బాపనయ్య వంటి అమరవీరులు నాయకత్వంలో జరిగిన పోరాటాలతోపాటు ఈ ప్రాంతంలో పాటూరు రామయ్య ఎంఎల్‌ఎగా ఉన్నప్పుడు మూడు వేల ఎకరాలు భూములు పేదలకు పంపిణీ అయ్యాయని గుర్తుచేశారు. చల్లపల్లి జమీందారీ వ్యతిరేక పోరాటాల స్ఫూర్తితో భూ పోరాటాలకు పదును పెట్టాలని పిలుపు నిచ్చారు. వామపక్షాల నాయకత్వంలో పోరాడి సాధించుకున్న (మిగతా 6లో)

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించండి

మిల్లర్లతో కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయని, ఈ నేపథ్యంలో మిల్లర్లు వెంటనే పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు కోరారు. ధాన్యం కొనుగోళ్లపై జిల్లాలోని రైస్ మిల్లర్ల యాజమాన్యాలు, మార్కెటింగ్, పౌర సరఫరాల అధికారులతో సోమవారం ఆయన నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో లక్ష 24 వేల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలో 17 రైస్ మిల్లులను కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్)గా ధాన్యం సరఫరాకు గుర్తించామన్నారు. గుర్తించిన రైస్ మిల్లులు రెండు రోజుల్లోగా బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల పాత్రకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలను ప్రకటించిందన్నారు. ధాన్యం తేమ విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు నిర్వహించిన రైతులకు 21 రోజుల్లో నగదు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రైతు కల్లాల నుంచి ధాన్యం వేబ్రిడ్జికి వెళుతుందని, అక్కడ నుంచి ర్యాండమ్ పద్ధతిలో కేటాయించిన రైస్ మిల్లుకు ధాన్యం చేరేలా పారదర్శక విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యాన్ని మిల్లింగ్ చేసే సమయంలో కొంత ధాన్యం నూకగా మారుతోందని, ఈ నష్టాన్ని భర్తీ చేయాలని కోరారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు రోజుల్లో బ్యాంకు గ్యారంటీలు సమర్పిస్తామన్నారు. రైస్ మిల్లర్ రంగారావు మాట్లాడుతూ రైతులకు, మిల్లర్లకు నష్టం కలగకుండా తేమ కొలిచే సాధనాలు (మోయిశ్చర్ మిషన్), వేయింగ్ మిషన్లను ర్యాండమ్‌గా తనిఖీ చేయాలని సూచించారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, పౌర సరఫరాల శాఖ డిఎం శివరామమూర్తి, డిఎస్ఒ పి.కోమలిపద్మ, డిప్యూటీ తహశీల్దారు భావనారాయణ పాల్గొన్నారు.



మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

'సహకార భూమి' కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సీనియర్ జర్నలిస్టులు, సహకారవేత్తలు, సహకార సంఘాల సారథ్యంలో 'సహకారభూమి జర్నల్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్' కార్యాలయాన్ని సోమవారం నగరంలోని శ్యామ్ నగర్‌లో ప్రారంభించారు. సొసైటీ ఆశయాలను ప్రతిబింబించే నేమ్ బోర్డును కెడిసిసి బ్యాంక్ చైర్మన్, సొసైటీ చీఫ్ ప్రమోటర్ తన్నీరు నాగేశ్వరరావు ప్రారంభించారు. సహకార జెండాను ఎపి కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రమోటర్లయిన నాన్ గెజిటెడ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు విద్యాసాగర్, పీపుల్స్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఎ.ఎల్లారావు, వికె కండ్రిక పిఎసిఎస్ అధ్యక్షుడు ఎం.రవీంద్రారెడ్డి, గుణదల ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు కిరంజి, సుధాకర్ రెడ్డి, శ్రీరామ ఫిషర్‌మెన్ వర్కర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఇబ్రహీంపట్నం పిసి తారామయ్య, రుద్రవరం పిఎసిఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టులు షేక్ అక్బర్ పాషా, కొమ్మాలపాటి శరత్ చంద్ర జ్యోతిశ్రీ, నెల్లూరి రాంబాబు, సిహెచ్.త్రినాథ్, కానూరి కష్ణ, కో-ఆపరేటివ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, రిటైర్డ్ జాయింట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



'సహకారభూమి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కెడిసిసి బ్యాంక్ చైర్మన్, సొసైటీ చీఫ్ ప్రమోటర్ తన్నీరు నాగేశ్వరరావు

పుస్తక పఠనంతో విజ్ఞానం

జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమయ్యాయి. మహాత్మాగాంధీ రోడ్డులోని రామమోహన గ్రంథాలయంలో జరిగిన ప్రారంభ సభలో గ్రంథాలయ అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవశ్యకతపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలన్నారు. ప్రస్తుతం గ్రంథాలయ వ్యవస్థపై ఆదరణ తగ్గుతున్న క్రమంలో వాటిని అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వాలు నిధులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉపాధ్యక్షులు దమ్మాల రామచంద్రరావు, కార్యదర్శి వేములపల్లి కేశవరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-వన్‌టౌన్:** ఎందరో మహనీయులకు గ్రంథాలయాలు మార్గదర్శకం చేసి ఉన్నతులుగా తీర్చిదిద్దాయని ఇంటర్మీడియట్ బోర్డ్ జిల్లా పర్యవేక్షణ అధికారి పి.రవికుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగేందుకు అవసరమైన జ్ఞానాన్ని అందించేది కచ్చితంగా గ్రంథాలయాలేనన్నారు. పుస్తక పఠనంతో అద్భుతమైన విజ్ఞానాన్ని సొంతం చేసుకోవటమే కాకుండా విలువలను పెంపొందించుకోవటానికి అవకాశముంటుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ కేబీఎన్ కళాశాల గ్రంథాలయంలో సుమారు సుమారు 82 వేల పుస్తకాలు



రామమోహన గ్రంథాలయంలో...

విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాశాల గ్రంథాలయ విభాగాధిపతి వై.శ్రీనివాసురాజు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ టి.భాగ్యకుమార్, అధ్యాపకులు డాక్టర్ జేవీ చలపతిరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మైలవరం:** గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ప్రసన్నరాణి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తిరుపతిరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు కోయ సుధా తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చందర్లపాడు:** మండలంలోని ఏటూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ మామిడి వెంకటేశ్వరరావు వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. **ప్రజాశక్తి-గంపలగూడెం:** మండలంలోని పెనుగలను, గంపలగూడెంలలో వారోత్సవాలు ప్రారంభించినట్లు ఆయా గ్రంథాలయాల



కెబిఎన్ కళాశాలలో మాట్లాడుతున్న రవికుమార్

ఇన్‌ఛార్జులు జ్యోతిర్మయి, సుంకర వెంకటేశ్వర్లు తెలిపారు. మొదటగా పెనుగలను ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, గంపలగూడెం సర్పంచ్ కోట పుల్లమ్మలు పతాకావిష్కరణ చేశారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** పట్టణంలోని గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో మునిసిపల్ వైస్ ఛైర్‌పర్సన్ షేక్ హఫీ జాన్నిసా వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కవి, ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు, రిటైర్డ్ ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంక్ మేనేజర్ కె.బాలగంగాధర్ తిలక్, గ్రంథాలయ అధికారిణి ఆలేటి ప్రభ, రికార్డ్ అసిస్టెంట్ ప్రభాకరరావు, శ్యామల, రమేష్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందిగామ:** కెవిఆర్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను ఇంఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావు ప్రారంభించారు. కళాశాల లైబ్రేరియన్ కుసుమ విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గాంధీ, కిషోర్, పాల్‌బాబు, సుశీల, అనంత రామిరెడ్డి పాల్గొన్నారు. నందిగామ బ్రాంచి గ్రంథాలయంలో వారోత్సవాలను 13వ వార్డు కౌన్సిలర్ గద్దె ఝాన్సీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి.ఉమారాణి పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-భవానీపురం: గర్భిణులు, బాలింతలు సమతులమైన చక్కటి పోషక ఆహారం తీసుకోవడం వల్ల వారి ఆరోగ్యం బాగుంటుందని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అన్నారు. సోమవారం రామరాజ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను కార్పొరేటర్ రత్నకుమారి అందజేశారు. ఈ సందర్భంగా సీమంతం కార్యక్రమం నిర్వహించారు. రత్నకుమారి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను వారికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కిట్లలో రాగి పిండి, అటుకులు, బెల్లం, ఎండు ఖర్జూరం, సజ్జ పిండి, వేరుశనగ చిక్కిలతో కూడిన ఆరు రకాల పోషకాలు ఉన్న ఆహారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జి.ప్రశాంతి, అంగన్వాడీ టీచర్లు జి.పావని, కె.బాజీ, కె.సరస్వతి, ఎం.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



18న కౌలురైతు సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-వీరులపాడు: ఈ నెల 18న జుజ్జూరులో జరిగే ఎపి కౌలురైతుల సంఘం ఎన్టీఆర్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారని అన్నారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తిలో కౌలు రైతులు ప్రధాన భూమిక పోషిస్తున్నారన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకీ రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, వాటి నివారణకు వేసినా స్వామినాథన్ కమిషన్ సిఫర్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 18న జరిగే మహాసభకు కౌలు రైతుల హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పత్తి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చాట్ల రవి, కె.పిచ్చేశ్వరరావు, కోట కళ్యాణ్, లాల్ అహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు భగత్‌సింగ్ కాలనీలో బాలల దినోత్సవం సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాలల దినోత్సవ ప్రాముఖ్యతను నాయకులు చప్పిడి సురేష్, ఆకుల రవి వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ట్యూషన్ టీచర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.



మిర్చి పంట పరిశీలన

ప్రజాశక్తి కంచికచర్ల: గండేపల్లి, వేములపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిర్చి పంటను ఉద్యానవన శాఖ అధికారి నీలిమ సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మిర్చి పంటకు ఆశించిన నల్లతామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యానవన సహాయకులు గండేపల్లి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కెసిపి సిమెంట్ కర్మాగారం కార్యాలయంలో సోమవారం హెచ్‌ఐవి బాధిత పిల్లలకు పౌష్టిక ఆహారం నిమిత్తం 85 వేల రూపాయల చెక్కును లెప్రా సొసైటీ వారికి కెసిపి వైస్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రావు అందజేశారు. స్టేట్ కో ఆర్డినేటర్ రాధిక మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కెసిపి సిమెంట్స్ వారు కుష్టు వ్యాధిగ్రస్తులకు, బోదవేదికస్థులకు పాదరక్షలు ఉచితంగా అందజేస్తున్నారని, అలాగే హెచ్‌ఐవి బాధితుల కోసం పౌష్టికాహారం కొరకు విరాళం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిఎస్ఆర్ ప్రతినిధి రాఘవేంద్ర, కెసిపి సిమెంట్ లెప్రా సొసైటీ ప్రతినిధి ఎవి బాష తదితరులు పాల్గొన్నారు.



పట్టుదలతో చదవాలి : జడ్జి

ప్రజాశక్తి-నందిగామ: ప్రతిఒక్క విద్యార్థి క్రమశిక్షణతో మెలుగుతూ, పట్టుదలతో చదువుకోవాలని నందిగామ అడిషనల్ జడ్జి జేసు రత్నకుమార్ తెలిపారు.బాలల దినోత్సవం సందర్భంగా సోమవారం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సు లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి జేసు రత్న కుమార్ మాట్లాడుతూ బాలలకు నిర్బంధ విద్య అవసరం అన్నారు. బాలలచే వెట్టి చాకిరి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.రాంబాబు నాయిక్, పాఠశాల ఛైర్ పర్సన్ ఓర్సు లక్ష్మీ, కోర్టు రిటైనర్ గింజుపల్లి రమేష్, నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నెకంటి జీవరత్నం, ఎజిపి మట్టా ప్రసాద్, న్యాయవాదులు గుర్రాల వెంకటరత్నం, వేల్పుల కిషోర్, గంటా నాగేశ్వరరావు, కౌన్సిలర్ కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

డప్పులు, గజ్జలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-చందర్లపాడు: డప్పు కళాకారులను ఆదుకోవాలని కోరుతూ ఎండిఓ కె.జ్యోతి కి కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి జి.నటరాజ్ మాట్లాడుతూ పెన్షన్ పొందుతున్న ప్రతి డప్పు కళాకారులకు డప్పులు, గజ్జలు, డ్రెస్సులు పంపిణీ చేయాలని జిల్లాల వారీగా ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయించిందన్నారు. అన్ని జిల్లాల్లో పంపిణీ చేసినా ఉమ్మడి కష్ణా జిల్లాలో మాత్రం పంపిణీ చేయకుండా మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉంచారని తెలిపారు. ఇప్పటికైనా వాటిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారులు నిడుముక్కల నాగేశ్వరరావు, కోట ప్రసాద్, కోట పుల్లారావు, మాడుగుల ఏడుకొండలు, కోట వెంకటేశ్వర్లు, మాతంగి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.





టిడ్కో ఇళ్ల వద్ద జనసేన నిరసన

ప్రజాశక్తి-భవానీపురం

కబేళా వద్ద పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా కాలయాపన చేయడంపై 45వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు బొమ్ము గోవింద లక్ష్మి, నాయకులు బొమ్ము రాంబాబు తదితరులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కొన్ని కోట్ల రూపాయలను వెచ్చించి నిర్మించిన సుమారు 20 బ్లాక్‌లను ఖాళీగా ఉంచారని విమర్శించారు. గత మూడు సంవత్సరాల నుంచి ఈ నిర్మాణాలు అసాంఘిక కార్యక్రమాలకు, కుక్కలకు, పందులకు స్థావరాలుగా మారాయని విమర్శించారు. అలాగే 39వ డివిజన్‌కు సంబంధించి 116, 117, 118 సచివాలయాల్లో జనసేన పార్టీ డివిజన్ అధ్యక్షులు ఏలూరు సాయి శరత్ ఆధ్వర్యంలో ఇళ్లకు సంబంధించి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి-నందిగామ: అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.కమల డిమాండ్ చేశారు. నందిగామ మండలం సిఐటియు 8వ మహాసభ స్థానిక ఎస్‌టియు భవనంలో సోమవారం జరిగింది. సభలో వారు మాట్లాడుతూ నందిగామ పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ రంగాల్లో ఉన్న కార్మికుల పెండింగు బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ వెంటనే విడుదల చేయాలని, సంఘటిత, అసంఘటిత రంగా కార్మికులకు సమగ్రమైన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కార్యదర్శిగా కటారపు గోపాల్, అధ్యక్షురాలుగా ఆదూరు సుశీల, ఉపాధ్యక్షురాలుగా నల్లాని నాగమణి, సహాయ కార్యదర్శిగా కర్రి వెంకటేశ్వరావు, కోశాధికారిగా దాసవరపు సైదా, కమిటీ సభ్యులుగా కోయా నాగేంద్రం, కుక్కల శ్రీను, కొల్లి సరళ, తిరుమలదేవి, పుట్ట మాణిక్యం, షేక్ హుస్సేన్, రవి, కటికలు సురేష్, తానూరి నరసింహారావు, పి.విజయలను ఎన్నుకున్నారు.

జగుపిళ్ల కృష్ణకు నివాళి

ప్రజాశక్తి-వన్‌టౌన్

నగర ప్రముఖులు జగుపిళ్ల కృష్ణ ద్వితీయ వర్థంతి కార్యక్రమం ఆయన కుమారుడు బాబీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు యలకల చలపతిరావు; మండేపూడి ఛటర్జీ, శ్రీనన్న దళం అధ్యక్షులు పోతిన వరప్రకాష్, విశ్వనాథ రవి, పిళ్లా తిలక్, కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభచాటిన స్రవంతి హైస్కూల్ విద్యార్థులు

స్రవంతి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గన్నవరం

విజయవాడ చిల్డ్రన్స్ టుటోరియల్స్ అసోషియేషన్ ఈ నెల 11,12,13 తేదీలలో నిర్వహించిన 10వ బాలోత్సవ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు క్రీడలు విద్యా, సాంస్కృతికలి అంశాలలో మంచి ప్రతిభను చాటి బహుమతులు సాదించటమే కాకుండా అకాడమిక్ అంశాలలో ఛాంపియన్ షిప్ గా నిలిచారని స్రవంతి హై స్కూల్ ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకష్ణ తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ 50 విద్య సంస్థల నుండి 5000 మంది మంది విద్యార్థులు పాల్గొన్నారని ఈ పోటీలలో అన్ని అంశాలలో ఓవరాల్ చాంపియన్ షిప్ ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. పాఠశాలలో విజేతల తో పాటు టీచర్స్,విద్యార్ధిని విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నేటి నుండి

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం : జెసి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 316 ఆర్ బీకేలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ డా. మహేష్ కుమార్ రావిరాల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో రైతుల సమస్యలు పరిష్కారానికి ప్రతి మండలంలో ఫోన్ నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

జగనన్న ఇళ్లు.. పేదలందరికీ కన్నీళ్లు

ప్రజాశక్తి-నాగాయలంక : మండల పరిధిలోని వక్కపట్ల వారి గ్రామం లోని జగనన్న కాలనీలు పేదలందరు కన్నీళ్లు డిజిటల్ క్యాంపెయిన్ కార్యక్రమం జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగాయలంక మండల అధ్యక్షులు చింత వెంకటేశ్వర, బండ్రెడ్డి మల్లికార్జున్ రావు, అలపర్తి కుమార్ స్వామి, బండ్రెడ్డి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు పెదశింగు లక్ష్మణరావు అందించిన సేవలు చిరస్మరణీయం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మాజీ శాసనసభ్యులు పెదశింగు లక్ష్మణరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం స్థానిక కోనేరు సెంటర్లో నిర్వహించిన బహిరంగ సభలో మాజీ శాసనసభ్యులు పాటూరు రామయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టుల సహకారంతో 1962లో శాసనసభ్యునిగా గెలుపొందిన లక్ష్మణరావు 22 వేల ఎకరాల భూములను పేదలకు పంపిణీ పంపిణీ చేయడానికి కషి చేశారన్నారు. అటువంటి విలువలు కలిగిన రాజకీయ నాయకులను నేటి రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి టిడిపి పోలీస్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పెద్దశింగు లక్ష్మణరావు ఒక రాజకీయ నాయకుడే కాకుండా ఒక గొప్ప సంఘసంస్కర్త అన్నారు.పెదశింగు అనగానే పోర్చుగీసు,బ్రిటిష్ కాలం నాటి వ్యాపార పరిస్థితులు గుర్తుకొస్తుందన్నారు. బహుశా బందరు నుండి అమెరికా వెళ్ళిన మొదటి వ్యక్తి వారేనేమో అన్నారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ రావు మాట్లాడుతూ కేంద్రంలో లాల్ బహదూర్ శాస్త్రి, రాష్ట్రంలో ప్రకాశం పంతులు, మచిలీపట్నంలో లక్ష్మణరావు ఆస్తులు సంపాదించకపోయినా ప్రజల గుండెల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించిన కుటుంబం వారిదన్నారు. వారి ఇంటిలో ఉండి వందలాది విద్యార్థులు చదువుకుని ఈరోజున ఉన్నత స్థితిలో ఉండడం గొప్ప విశేషం అన్నారు. నగర పాలక సంస్థ మేయర్ మోకా వేంకటేశ్వరమ్మ, మాజీ చై ర్మన్ షేక్ సిలార్ దాదా, ఎం వి.బాబా ప్రసాద్, సిపిఎం నాయకులు కొడాలి శర్మ, జన సేన నాయకులు బండి రామకష్ణ, వైసిపి యువ నాయకులు పేర్ని కిట్టు, తదితరులు ప్రసంగించిన ఈ బహిరంగ సభలో లక్ష్మణరావు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

రైతు సంఘం జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-కోడూరు : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏర్పాటు దినోత్సవాన్ని పురస్కరించుకొని కోడూరు మండలంలో యిస్మాయిల్ బేగ్ పేట, దింటిమేరక గ్రామాలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోడూరు మండల కమిటీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించారు. యిస్మాయిల్ బేగ్ పేట గ్రామంలో కోట సుబ్బారావు జెండా ఆవిష్కరించారు. దింటిమేరక గ్రామంలో జొన్నలగడ్డ రాజగోపాల రావు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఆవుల బసవయ్య మాట్లాడుతూ 1936 నవంబర్ 14న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏర్పాటయ్యిందని, గడచిన ఈ 86 సంవత్సరాల కాలంలో రైతుల కోసం అనేక పోరాటాలు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతుల సమస్యపై నిరంతరం ప్రభుత్వంతో పోరాడుతూ రైతు సమస్యలను పరిష్కరించే విధంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఘంటసాల ప్రసాద్, కంచర్లపల్లి బుజ్జి, గోవాడ నాగయ్య, కోట చంటి తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ ప్రముఖులు మోహనరావు మృతి

ప్రజాశక్తి పెడన : దేవాంగ ప్రముఖులు, పెడన కలంకారీ అసోసియేషన్స్ యూనియన్ అధ్యక్షులు, విద్య దాత బట్ట మోహనరావు మృతిచెందారు. కొంతకాలంగా అనా రోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్లో సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. మోహనరావు మతికి పట్టణ దేవాంగ ప్రముఖులు నివాళులర్పించి సంతాపం తెలియజేశారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాల్ రావు, పెడన మున్సిపల్ మాజీ చైర్మన్ బోడ్డు పద్మజా కుమారి, టిడిపి పట్టణ అధ్యక్షులు యక్కల శ్యామలయ్య, మాజీ కౌన్సిలర్ యర్ర రాజా మోహనరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : బుద్ధప్రసాద్

- పలుచోట్ల ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. సోమవారం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో గాంధీ క్షేత్ర అభివద్ధి కమిటీ దివిసీమ లలిత కళా సమితి దివిసీమ బాలానందర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత మాజీ ప్రధాని కీర్తిశేషులు జవహర్లాల్ నెహ్రూ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతిభ పాటల పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి పాలపర్తి శ్యామలానంద, గాంధీ క్షేత్రం కమిటీ కార్యదర్శి మట్టి శ్రీనివాసరావు, దివిసీమ లలిత కళా సమితి కార్యదర్శి కోనపరెడ్డి చంద్రశేఖర్, గుడిసేవ విష్ణు ప్రసాద్, ఎస్సీ ఎల్ కళాశాల అధిపతి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వీరవల్లి విశ్వభారతి హై స్కూల్లో ...

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : బాపులపాడు మండలం వీరవల్లి విశ్వభారతి హై స్కూల్ లో బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫిరోజ్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు చేతులమీదగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ బ్యాంకు అఫ్ ఇండియా మేనేజర్ నరేష్ కుమార్, వ్యాయమ ఉపాద్యాయుడు గోళ్ళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జంక్షన్లోని సిద్దార్థ విద్యాలయాల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో బహుమతులు అందిస్తున్న బుద్ధప్రసాద్



పమిడిముక్కల మండలంలో విద్యార్థుల వేషదారణలు

కొమ్మారెడ్డి పాఠశాలలో బాలల దినోత్సవం

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లిలోని కొమ్మారెడ్డి పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రవాణాశాఖాధికారి పి సీతాపతి రావు, ఎంఈఓ కేవిస్వి ప్రసాద్, జడ్పిటిసి బంటుమిల్లి మలిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలోముందుగా జవహర్లాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

ప్రజాశక్తి-పమిడిముక్కల : బాలల దినోత్సవం సందర్భంగా పమిడిముక్కల మండలంలో పలుచోట్ల మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు.స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ప్రధానోపాధ్యాయుల కేశవ నారాయణ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని మంటాడలో ఐద్వా మహిళా సంఘం నాయకురాలు వేణు కుమార్ ఆధ్వర్యంలో పిల్లలకు నెహ్రూ వేషధారణతో పాటలు పద్యాలు, డాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి కోడూరు : కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని స్వతంత్రపురంలోని చామర్తి ప్రకాశరాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అవనిగడ్డ నియోజకవర్గం శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు తనయుడు సింహాద్రి వికాస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా తొలుత భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో, చిత్రలేఖనం, వ్యాసరచన, సాంస్కృతిక కార్యక్రమాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, ట్రిపుల్ ఐటీలో ర్యాంకు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఘనంగా జాతీయ సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి- చల్లపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి వెన్నుముకగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు నిలుస్తున్నాయని చల్లపల్లి పిఎస్‌సిఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి) అన్నారు. జాతీయ సహకార వారోత్సవాలు చల్లపల్లి సొసైటీలో సోమవారం ఘనంగా ప్రారంభించారు. తొలుతగా సంఘ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి)సహకార పతాకాన్ని ఆవిష్కరించి సహకార వారోత్సవాలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ రైతులకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా తక్కువ వడ్డీలకు స్వల్ప కాలంలో రుణాలు అందజేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో సంఘ సీఈవో తోట కష్ణారావు, పర్సన్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మండల కేంద్రం మోపిదేవి లో 69వ అఖిల భారత సహకార వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. మోపిదేవి సహకార పరపతి సంఘం లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేడిసిసి బ్యాంక్ మోపిదేవి బ్రాంచ్ మేనేజర్ ఎన్ త్రివిక్రమ రావు మాట్లాడుతూ మండల పరిధిలోని ఆరు సహకార సంఘాల ద్వారా సాలీన నాలుగు కోట్ల 22 లక్షల 41 వేలు గత సంవత్సరం వ్యాపారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడిసిసి బ్యాంక్ మోపిదేవి బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ పి. స్వర్ణలత, మోపిదేవి వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్ పర్సన్ రావి రాంప్రసాద్, సంఘం కార్యదర్శి మోపిదేవి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి-చల్లపల్లి : కార్తీకమాసంను పురస్కరించుకుని మహిమాన్విత శైవక్షేత్రం నడకుదురు శ్రీ పద్వీశ్వర స్వామి వారి ఉసిరిక వనంలో కార్తీక వనసమారాధన కార్యక్రమం సోమవారం జరిగింది. నాదెళ్లవారిపాలెం శ్రీ పద్వీశ్వర భక్తసమాజం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని వన భోజనాలు చేశారు. గ్రామ పెద్దలు నాదెళ్ల వెంకట నరసయ్య, పాలకేంద్రం అధ్యక్షుడు వడ్లమూడి గోపీచంద్ ల పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉసిరిచెట్ల వద్ద మహిళలు దీపారాధనలు చేశారు. కేదారేశ్వర వ్రతం ఆచరించి..శ్రీ పద్వీశ్వర స్వామికి విశేష పూజలు చేశారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-గన్నవరం

పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని ఐద్వా జిల్లా నాయకులు మల్లంపల్లి జయమ్మ అన్నారు. సోమ వారం బుధవారం ఎంపీపీ స్కూల్లో పిల్లలకు ఆటల పోటీలు పెట్టి బహుమతులు అందజేశారు. జయమ్మ మాట్లాడుతూ.. పిల్లల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని కోరారు. పిల్లల దినోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది ఐద్వా ఆధ్వర్యంలో పోటీలు పెట్టి బహుమతులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మరిదు వరప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దావాజీ గూడెం, ముస్తాబాద్ స్కూళ్లలోనూ పాటలు, పాటల పోటీలు పెట్టి గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విపిఎల్-22 క్రికెట్ టోర్నమెంట్ స్థానిక రైల్వేస్టేడియంలో సోమవారం ప్రారంభమయింది. ఈ టోర్నమెంట్‌ను టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం కావాలన్నారు. గత టిడిపి ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు మంచి ప్రోత్సాహం సహకారాలు అందించారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి క్రీడలను, క్రీడాకారులను పట్టించుకోవట్లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి చరణ్‌సాయి యాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పత్రి రాఘవచరణ్, పార్లమెంటు ఉపాధ్యక్షులు గరిమెళ్ల సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో మరో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని ఔట్ ఏజెన్సీ హరిజనవాడలో ఇటీవల జరిగిన రౌడీ షీటర్ కోపూరి రమేస్ హత్య కేసును భవానీపురం పోలీసులు ఛేదించి ఈనెల 12వ తేదీన ఐదుగురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించిన విషయం విధితమే. అయితే అదే కేసులో భవానీపురం సిఐ ఎం.డి.ఉమర్ మరింత విచారణ చేపట్టిన నేపథ్యంలో ఐదుగురుని అదుపులోకి తీసుకుని విచారించారు. అందులో ఊర్మిళానగర్‌కు చెందిన దేవిరెడ్డి పవన్ కళ్యాణ్, రాంపిళ్ళ రిషిదీప్‌కుమార్‌లతో పాటు మరో ముగ్గురు మైనర్లు హత్య కేసులో నిందితులు కావటంతో సోమవారం మేజర్లు ఇద్దరిని రాజమండ్రి జైలుకు తరలించగా, ముగ్గురు మైనర్లను కబేళాలోని రామరాజ్యనగర్‌లో గల జునైవల్ పిల్లల జైలుకు తరలించినట్లు సిఐ ఎం.డి. ఉమర్ తెలిపారు.

రాజారావు సేవలు స్ఫూర్తిదాయకం

బాపట్ల ఎంపి నందిగం సురేష్

ప్రజాశక్తి-వన్‌టౌన్: కార్మిక నేత, కమ్యూనిస్టు నాయకుడు, మాజీ కౌన్సిలర్ పేటేటి రాజారావు సేవలు స్ఫూర్తిదాయకమని బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్ అన్నారు. వించి పేట సిఎస్ఐ చర్చి సెంటర్‌లో రాజారావు శత జయంతి వేడుకలు కుటుంబ సభ్యులు పేటేటి రాజశేఖర్, పేటేటి రాజమోహన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగాయి. తొలుత రాజారావు చిత్రపటానికి ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, టిడిపి నాయకులు నాగుల్ మీరా, సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, ఏపి స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసీఫ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ పాత బస్తీ ప్రాంతంలో సిపిఐ కార్పొరేటర్‌గా రెండుసార్లు కౌన్సిలర్‌గా ఎన్నికై పేద ప్రజలకు సేవలు అందించిన రాజారావు సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని కోరారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆనాటి కంసాలి పేటను నాటి రాజరాజేశ్వరిపేటగా అభివృద్ధికి బాటలు వేసిన కౌన్సిలర్‌గా రాజారావుకు ఓ గుర్తింపు లభించిందన్నారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపిల కంటే, నిత్యం ప్రజల మధ్యనే ఉండే కార్పొరేటర్లకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. టిడిపి నాయకులు నాగుల్ మీరా మాట్లాడుతూ కమ్యూనిస్ట్ నాయకుడిగా, రెండుసార్లు కౌన్సిలర్‌గా ప్రజల పక్షాన ఉంటూ సేవలు అందించిన రాజారావు సేవలు మరువలేనిదన్నారు. బోయి సత్యబాబు మాట్లాడుతూ కమ్యూనిస్టు నాయకుడిగా, కౌన్సిలర్‌గా పేదల పక్షాన నిలబడి సేవలు అందించిన పేటేటి రాజారావు నేటి నాయకులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆనాడు ఏ ఇంటిలో ఉన్నారో అదే ఇంటిలో కటుంబ సభ్యులు అలాగే నివసించటం పట్ల కొనియాడారు. ఇటీవలి దీపావళి పండుగ సందర్భంగా స్థానికుల పాక దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబ సభ్యులకు వంటసామాగ్రి, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే పేటేటి రాజారావు జ్ఞాపకార్థం పేద మహిళలకు చీరలు, రగ్గులు అతిథుల చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు, అబ్దుల్ అర్షద్, బుల్లా విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ దాడి అప్పారావు, 50వ డివిజన్ సిపిఐ అధ్యక్షులు తాడి పైడియ్య తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపి సురేష్



చిట్టినగర్‌లో...



గంపలగూడెంలో...



స్కాట్స్‌పైన్ స్కూల్‌లో...

ఘనంగా బాలల దినోత్సవం



వత్సవాయిలో...

ప్రజాశక్తి-వన్‌టౌన్: చిట్టినగర్ బంగారయ్య కొట్టు సెంటర్‌లోని సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సోమవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపల్ లయన్ డాక్టర్ రాజు డేవిడ్ ధొంతలూరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త జూజారామ్‌చౌదరి పాల్గొని చదువులో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. ప్రజాశక్తి-మైలవరం: స్థానిక వివేకానంద స్కూలో ఫ్యాన్సీ డ్రస్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అకర్షించాయి. ఎస్ఈబీ మైలవరం సీఐ గిరిజ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాశక్తి-కంచికచర్ల: గండేపల్లి గ్రామంలోని గండేపల్లి రాఘవరాయ మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు సిహెచ్.రామకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. అక్షర కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. చైతన్య పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ వి.రాజకుమారి పాల్గొని నాసా కార్యక్రమాలకు ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని మిట్టగూడెం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆటల పోటీలో గెలుపొందిన చిన్నారులకు విమలభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను బహుమతులను అందజేశారు. అనంతరం చిన్నారుల నడుమ కేక్ కట్ చేసి స్వీట్లు అందజేశారు. తిరుమలగిరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఆర్యవైశ్య విద్యాశాఖ చైర్మన్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు తూములూరి ప్రసాదబాబు పాల్గొన్నారు. ధర్మవరప్పాడు తండా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లాహోరి హనుమంతు జవహర్ లాల్ జయంతి గురించి విద్యార్థులకు తెలియజేశారు. విజ్ఞాన్ స్కూల్లో ఫ్యాన్సీ డ్రస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-గంపలగూడెం: కష్టంతో కాక ఇష్టంతో చదవాలని ఏపీ లిడ్‌క్యాప్ డైరెక్టర్ కోనేరు సత్యప్రియ అన్నారు. గంపలగూడెం-తోటమూలలో గల సాన్‌జోస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బాలల దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోరగుడి సుధీర్‌బాబు, పాఠశాల హెచ్‌ఎం కీర్తన, స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ అజయ్‌కుమార్, పాల్గొన్నారు. ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి రాష్ట్ర ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రజాశక్తి-వత్సవాయి: స్థానిక జడ్పీహెచ్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను పాల్గొని విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మెంబర్ యేసపోగు దేవమణి, వైస్ ఎంపీపీ కాటేపల్లి రామలక్ష్మి, గ్రామ సర్పంచి భూక్య సీతమ్మ, డబ్బాలపల్లి సర్పంచ్ నగేష్, సొసైటీ ప్రెసిడెంట్లు రంగశెట్టి ముక్తేశ్వరరావు, పాలంపల్లి సొసైటీ అధ్యక్షులు కాటేపల్లి రవికుమార్, పండగ శ్రీనివాసరావు, మండల వైసిపి అధ్యక్షులు గాదెల రామారావు తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: విజయవాడ మాచవరంలోని భాష్యం లిటిల్ చాంప్స్ స్కూల్‌లో నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపల్ నాగరాణి బాలల దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాజిదా, నీతూ, తనుజా పాల్గొన్నారు. స్కాట్స్‌పైన్ అంతర్జాతీయ పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ శాంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రతిమ చలసాని పాల్గొన్నారు. సిద్దార్థ నగర్‌లోని లిటిల్ బ్రైన్స్ పాఠశాలలో పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి, ప్రిన్సిపల్ డి.జి.శేఖర్ పాల్గొన్నారు. మొగల్‌రాజపురంలోని వి.పి.సిద్దార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వారి ఇంటి నుండి తీసుకువచ్చిన నిత్యావసర వస్తువులను అనాథ ఆశ్రమానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ రోజ్ మేరీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చందర్లపాడు: చింతలపాడు గ్రామంలో అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్ రావు సోమవారం శంకుస్థాపన చేశారు. దీనిని రూ.9.5 లక్షలతో చేపట్టనున్నట్లు తెలిపారు. చిన్నారులకు బోధన, సమతుల్య ఆహారం పంపిణీతో పాటు గర్భిణీలకు అన్ని వసతులు ఒకేచోట లభించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

స్పందనకు రెండు అర్జీలు

ప్రజాశక్తి-గంపలగూడెం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రెండు అర్జీలు వచ్చినట్లు తాసిల్దార్ జి.బాలకృష్ణారెడ్డి తెలిపారు. చింతల నరవ నుండి మేడూరు వస్తున్న ప్రధాన రహదారి కంపచెట్లతో మూసుకుపోయిందని దానిని తొలగించాలని, మేడూరులో కమ్యూనిటీ హాల్ బజార్‌లో డ్రైనేజీ పూడిక తీయాలని వినతిపత్రాలు అందాయి.

పెట్రోల్ బంక్‌లో పంపు సీజ్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని షేర్ మహమ్మద్ పేట ఎక్స్‌రోడ్‌లోని పెట్రోల్ బంక్‌లో డిజిటల్ మీటార్ ద్వారా అవకతవకలకు పాల్పడుతున్నారని వాహనదారుల ఫిర్యాదు మేరకు సోమవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో డిజిటల్ మీటర్‌లో నమోదు చేసిన ధరకు తగిన విధంగా ఆయిల్ లేదని అధికారులు గుర్తించారు. పంప్ ఆపరేటర్ ఆయిల్ కొట్టేటప్పుడు పంపును లాక్ చేసి అవకతవకలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. దీంతో పెట్రోల్ పంపుకు సీల్ వేశారు. బంక్‌లో మామూలు పెట్రోల్‌ను కూడా హైస్పీడ్ పెట్రోల్ పేరుతో అధిక ధరకు, బంకులోని అన్ని పంపులను పరీక్షించాలని వాహనదారులు కోరుతున్నారు.

సహకార సంఘ వారోత్సవాలు

ప్రజాశక్తి-వీరులపాడు

పెద్దాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సహకార వారోత్సవాల సందర్భంగా సంఘ చైర్ పర్సన్ ఆవుల ప్రసాద్ సహకార జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి, గ్రామ సర్పంచ్ శాంతమ్మ, వైసిపి మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో మధుమేహం నియంత్రణ : శ్రీదేవి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: డయాబెటిస్ గురించి సంపూర్ణమైన అవగాహన కలిగివుండి, అప్రమత్తంగా వ్యవహరిస్తే దాని దుష్ప్రభావాల బారినపడకుండా ఉండొచ్చని అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్, ప్రఖ్యాత డయాబెటాలజిస్ట్ డాక్టర్ జి.శ్రీదేవి అన్నారు. యోగా తదితర శారీరక వ్యాయమ పద్ధతుల ద్వారా మధుమేహ వ్యాధిని నియంత్రణలో ఉంచుకోవచ్చని తెలిపారు. వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా, అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు, యోగా శిక్షకులు, యోగా సాధకులు పాల్గొని యోగాసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ అను గ్రూప్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆవిష్కరించబడిన డయాబెటిస్ క్లబ్ ద్వారా మధుమేహ వ్యాధిగ్రస్తులకు, స్థూలకాయంతో బాధపడుతున్నవారికి విస్తతమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ శ్రీదేవి వెల్లడించారు. రూ.999తో అను డయాబెటిస్ క్లబ్ సభ్యత్వం పొందడం ద్వారా రూ. ఐదు వేల విలువైన వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఉచితంగా



చేయించుకోవచ్చని తెలిపారు. ఉచిత కన్సల్టేషన్ తో పాటు, వ్యాధి నిర్ధారణ పరీక్షలపై 20 శాతం, మందులపై 10 శాతం రాయితీ లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అను హాస్పిటల్స్ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ వి.బి. ప్రవీణ్ నాయుడు, డయాబెటాలజిస్ట్ డాక్టర్ ఎస్. కిరణ్ కుమార్, కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ దుగ్గిరాల పూజిత, డాక్టర్ రిజ్వాన్ పాల్గొన్నారు.

22న పెండింగ్ సమస్యల పరిష్కారానికి ధర్నా : యుటిఎఫ్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పిఎఫ్, ఏపిజిఎల్, డిఎ అరియర్లు, సరెండర్ లీవులు ఆర్థిక సంబంధమైన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 22 తేదీన కలక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి జె. లెనిన్ బాబు తెలిపారు. ఈ మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు కు ధర్నా నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించవలసిన పిఎఫ్, ఏపిజిఎల్, డిఏ అరియర్లు, సరెండర్ లీవులు, రిటైర్డ్ ఉద్యోగుల పిఎఫ్, ఏపిజిఎల్ఎస్ఐ, డిఎ అరియర్లు, ఎరండ్ లీవు ఎన్ క్యాష్ మెంట్, గ్రాట్యూటీ, కమ్యుటేషన్ బకాయిలు సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్నాయని వాటిని చెల్లిం చాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలంగా ఈ ఆర్థిక బకాయిలు చెల్లించబడక పోవడం వలన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర మానసిక క్షోభకు గురి అవుతున్నారని అన్నారు. కావున ఈ ఆర్థిక బకాయి లన్నిటిని వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. వినతి పత్రం ఇచ్చినవారిలో జిల్లా కార్యదర్శి జె. ప్రసాదరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అబ్దుల్ వహీద్, పెడన మండల శాఖ ప్రధాన కార్యదర్శి కె.రంగనాథ్ ఉన్నారు.



ధర్నా నోటీసు అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు



అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్: మచిలీపట్నం నగర పాలక సంస్థ 41 వ డివిజన్లో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎం అప్పలనాయుడు అప్పమ్మ దంపతుల పూరి గుడిసె అగ్నికి ఆహుతైంది. స్థానిక జనసేన నాయకుల సహకారంతో ఇంచార్జి బండి రామకష్ణ నిరాశ్రయులైన నిరుపేద దంపతులను పరామర్శించి 15 వేల రూపాయల నగదు 5000 రూపాయల విలువైన నిత్యవసరాల కిట్టును సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డం రాజు, వంపు గడవల చౌదరి డివిజన్ ఇంచార్జు వాళ్లే రామ్ నాయుడు, కర్రీమహేష్, కొండ మనిబాబు పాల్గొన్నారు.

చిన్నారులకు వెల్ బేబి షో

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు వెల్ బేబీ షో ని సోమవారం నిర్వహించినట్లు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. వై సూషమ రాహుల్ సహకారంతో నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ వేణుగోపాలరావు, డాక్టర్ జయ శ్రీ డాక్టర్ మాధవి వ్యవహరించగా వై జాహ్నవి, కె జెసిక, కే జ్యోతి సాయి ప్రధమ బహుమతులు సాధించగా, నిరీక్షణ, శ్రీ హర్ష, మోక్షజ్ఞ, ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ వైసిపి ప్రసాద్, బరంధామయ్య, రామకష్ణ పాల్గొన్నారు.

నాడు-నేడుతో విప్లవాత్మక మార్పులు : మంత్రి

ప్రజాశక్తి-పెడన : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకంతో విద్యావ్యవస్థలో ఎంతో విప్లవాత్మక మార్పు వచ్చిందని రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆయన పెడన మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ బొడ్డు నాగయ్య స్మారక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు-నేడు పథకం రెండవ దశ పనులు కింద రూ.62 లక్షల 43 వేల 434 రూపాయల వ్యయంతో చేపడుతున్న అభివద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు కార్పొరేట్ కళను సంతరించుకోనున్నాయన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే పిల్లలు ఆహారానికి ఇబ్బంది పడకూడదని సదుద్దేశంతో స్వచ్ఛందంగా అధ్యాపకులు ఈ కార్యక్రమానికి పూనుకోవడం ఎంతో సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో పెడన మున్సిపల్ చైర్మన్, కళాశాల పూర్వ విద్యార్థిని బళ్ళా జ్ఞాన లింగ జ్యోత్స్న రాణి, స్థానిక కౌన్సిలర్ తనూజ, 3 వ వార్డు కౌన్సిలర్ బళ్ళా గంగయ్య, కళాశాల ప్రిన్సిపాల్ పెదపల్లి బెన్నీ సాల్మన్ రాజు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పరికరాలు అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)

మెడికల్ కాలేజ్ అనుబంధ ఆసుపత్రికి వితరణ ఇచ్చిన డిజిటల్ ఎక్సరే పరికరాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ కు బీ.సీ సంక్షేమ సంఘం కష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పేద రోగులకు మెరుగైన వైద్యం అందించే దిశగా గతంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి ఖరీదైన(సుమారు కోటి రూపాయలు విలువ) పరికరములు మంజూరు కాగా వాటిని ఆస్పత్రి వర్గాలు మూలకు చేర్చారని,దీంతో ప్రజాధనం వధా అవ్వడమే కాక, ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదన్నారు. కార్యక్రమంలో బీ.సీ పట్టణ అధ్యక్షులు తోట బాబు, వేముల బుజ్జి, చేబోయిన కోటేశ్వరరావు, జన్ను గోవిందు, పుట్టి రాజశేఖర్, బోయిన మురళి, కె.కిరణ్, తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి

పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ పరిధిలో వున్న శివాపురం గ్రామంలో అధికారులు స్పందించక పోవడం వలన గ్రామస్తులు కోరిక మేరకు పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మట్టిరోడ్డులు వేశామని, ఈ మట్టిరోడ్డుకు సీసీ రోడ్డు గ్రాండ్లు మంజూరు చేయాలని పామర్రు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా సోమవారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ను కలసి వినతి పత్రం అందజేశారు.

'స్పందన'కు గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతివారం నిర్వహించే స్పందన కార్యక్ర మానికి జిల్లా అధికారులందరూ తప్పని సరిగా హాజరు కావాలని లేకుంటే క్రమ శిక్షణ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా హెచ్చరించారు.సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన స్పందనలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలు గడువులోగా పరిష్కరించాలని, రీ ఓపెన్ కేసులు రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ శాఖల్లో స్పందన పెండింగ్ అర్జీలలో గడుపు దాటినవి, రీ ఓపెన్ కేసులు శాఖల వారీగా సమీక్షిం చారు. జిల్లాలో రీ ఓపెన్ కేసులు ఎక్కువగా రెవెన్యూ (సిసిఎల్ఎ) అర్జీలు రీ ఓపెన్ అవుతున్నాయని, రీ ఓపెన్ అయిన అర్జీలు క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన విచారణ గురించి అర్జీదారుడు సంతప్తి కరంగా పరిష్కరించాలని సూచించారు.

నలుగురు అధికారులకు షోకాజ్ నోటీసులు : ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా స్పందనకు గర్హాజరు అయిన నలుగురు అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ,జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు ను ఆదేశించారు. కలక్టర్ ఆదేశాలమేరకు జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్, జిల్లా ఔషద నియంత్రణ అధికారి,జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, పెడన మున్సిపల్ కమిషనర్ లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కుష్టు నివారణ కార్యక్రమాలపై పోస్టర్ విడుదల : జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15 నుండి డిసెంబర్ 5 వరకు 21 రోజుల పాటు జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రత్యేక క్యాంపైన్ నిర్వహించనున్నట్లు. కలెక్టర్ తెలిపారు. ఆశా, సచివాలయ ఎన్ఎంలు వారి వారి పరిధిలో డోర్ టు డోర్ సర్వే నిర్వహించి కుష్టు వ్యాధి కేసులను గుర్తించి నమోదు చేయడంతో పాటు నివారణ కొరకు చికిత్స అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాలను పటిష్టవంతంగా నిర్వహించాలని కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ముడా విసి బి.నారాయణరెడ్డి, ఆర్డీవో ఐ.కిషోర్, డ్వామా పిడి జి.వి. సూర్యనారాయణ, డిపిఓ, ఎం వి.నాగేశ్వరనాయక్, డిఈఓ తాహెర సుల్తానా, సాంఘిక సంక్షేమ శాఖ డి డి కె. సరస్వతి, డిఎంఅండ్ హెచ్ వో డాక్టర్ గీతాబాయిపాల్గొన్నారు.

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా ద్వితీయ మహాసభ కృష్ణాజిల్లా మొవ్వ మండలం కూచిపూడిలోని చేబ్రోల్ భాస్కరరావు ప్రాంగణం (శాంతికాంప్లెక్స్)లో సోమవారం నిర్వహించారు. తొలుత పెదపూడి వంతెన సంటర్ నుంచి కూచిపూడి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు , వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శివ నాగరాణి, వ్యకాస కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యకాస కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు





పాటలు పాడుతున్న కళాకారులు



సంగీతరావు



మురాల రాజేష్



పాగోలు రమేష్



శీలం నారాయణరావు



వై.శివనాగరాణి



యద్దనపూడి మధు



జ్యోతి

ఓర్పుతో వినండి....సమస్యను పరిష్కరించండి...

కలెక్టర్ ఎస్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : స్పందనలో అర్జీలను స్వీకరించి అర్జీదార్ల నుండి సమస్యను పూర్తిగా విని అర్థం చేసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నప్పుడే స్పందన లక్ష్యం నెరవేరుతుందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయం పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. అర్జీదారులనుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత సమస్య ఎదురైనప్పుడు పరిష్కరించాల్సిన వారి నుండి సానుకూల దృక్పధాన్ని ఏవిధంగా ఆశిస్తామో అదే రీతిన అర్జీదారుడు ఆశిస్తారనే విషయాన్ని అర్థం చేసుకోగలిగితే సమస్యను పరిష్కరించడానికి మార్గాలు కనుగొంటుకుతామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందనలో దాదాపు 50 శాతానికిపైగా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగలుగుతున్నామన్నారు. మిగిలిన అర్జీలు కొన్ని కోర్టుల పరిధిలోను, మరికొన్ని రెవెన్యూ కోర్టుల పరిధిలోను ఉంటున్నాయని, వాటిని ఏవిధంగా పరిష్కారించాలనే ఆలోచన చేయాలని అన్నారు. స్పందనలో 79 వినతులు నమోదు కాగా, వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 30, పోలీస్ 14, యంఎయుడి 9, విద్య 8, వైద్య 5, వ్యవసాయ 4, పంచాయతీరాజ్ 2, వివిధ శాఖలకు సంబంధించి 7 అర్జీలు నమోదయ్యాయన్నారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్‌వో కె.మోహన్‌కుమార్, అసిస్టెంట్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి, ఖలీఫ్ కౌసర్ బానో, డ్వామా పీడీ జె.సునీత, డిఇఒ సీవీ రేణుక, ఐసిడిఎస్ పీడీ ఎ.ఉమాదేవి, గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి కె.అనురాధ, డీఎస్‌వో పి.కోమలి పద్మ, హౌసింగ్ పీడీ శ్రీదేవి,



వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



'రామమోహన' లైబ్రరీలో వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : ఎంజి రోడ్డులోని రామమోహన గ్రంథాలయంలో సోమవారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో గ్రంథాలయ అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు దమ్మాల రామచంద్రరావు, కార్యదర్శి వేములపల్లి కేశవరావు పాల్గొన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్దార్థ మహిళా కళాశాల గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యారు.

పుస్తకాలే నిజమైన నేస్తాలు : డాక్టర్ ఎం సుశీలరావు

ప్రజాశక్తి - తిరువూరు : మనిషికి నిజమైన మిత్రులు పుస్తకాలేనని తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుశీలరావు పేర్కొన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా కళాశాల ప్రాంగణంలో కళాశాల లైబ్రేరియన్ డాక్టర్.కె.కుసుమ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుశీలరావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమానికి దీటుగా గ్రంథాలయ ఉద్యమం జరిగిందని, అన్ని వర్గాల ప్రజల్లో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిలించటానికి గ్రంథాలయ ఉద్యమం కూడా దోహదం చేసిందని గుర్తుచేశారు. కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ కుసుమ కుమారి మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. రోజుకొక ఈవెంట్‌తో విద్యార్థుల్లో పుస్తక పఠనంపై అవగాహన, ఆసక్తి కలిగేవిధంగా కార్యక్రమాలను రూపొందించామని



వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందనలో 24 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజాసమస్యల పరిష్కార దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందనలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజలు తెలిపిన సమస్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని పలు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళికకు సంబంధించి 8, ఇంజనీరింగ్ 4, పబ్లిక్ హెల్త్ విభాగం 4, ఎస్టేట్ 2, యుసిడి విభాగం 4, రెవిన్యూ 2 అర్జీలు వచ్చాయి. ఈకార్యక్రమంలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర రావు, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ యుసిడి శకుంతల, ఎడిహెచ్ శ్రీనివాసు, బయాలజిస్ట్ డాక్టర్ బాబు శ్రీనివాసన్ పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాల్లో 5 అర్జీలు

జోనల్ కమిషనర్లు నిర్వహించిన స్పందనలో సర్కిల్ 2 పరిధిలో పట్టణ ప్రణాళిక 2 అర్జీలు, సర్కిల్ 3 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక-1, ఇంజనీరింగ్ 2 అర్జీలు వచ్చాయని, సర్కిల్ 1 పరిధిలో అర్జీలు రాలేదని జోనల్ కమిషనర్లు తెలిపారు.

కెడిసిసిబిలో సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం 69వ అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ సహకార యూనియన్ ఛైర్మన్



దేశిరెడ్డి రాఘవరెడ్డి పతాకాన్ని ఆవిష్కరించారు. సహకారసంఘం, సహకార శాఖ ఉద్యోగస్తులకు, రైతులకు సహకార వారోత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో బ్యాంకు జిఎం రంగబాబు, కృష్ణా జిల్లా సహకార బ్యాంకు చీఫ్ మేనేజర్లు, మేనేజర్లు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



డివైఎఫ్ఐ నూతన కమిటీ

ప్రజాశక్తి - పెనమలూరు : డివైఎఫ్ఐ వైఎస్ఆర్ తాడిగడప పట్టణ కమిటీ సమావేశం ఇబ్రహీం అధ్యక్షతన జరిగింది. డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన రామన్న, జిల్లా నాయకులు బాజీ బాబు మాట్లాడారు. అనంతరం 12 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారను. అధ్యక్ష కార్యదర్శులుగా క్రాంతి, లక్ష్మి నారాయణ, ఉపాధ్యక్షులుగా హుస్సేన్, సహాయ కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా సోమశేఖర్, గౌరవాధ్యక్షులు ఇబ్రహీం ఎన్నికయ్యారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీం, గోపి ,తులసీరామ్, మొహిరి ,హేర్ష తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

దశమరత్నంగా భూ పంపిణీ చేయాలి

ఉపాధి హామీ చట్టానికి నిధులు కేటాయింపుల్లో కేంద్రం కోత పెడుతోందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడానికి, కూలి పెంపునకు ఐక్యంగా పోరాడాలన్నారు.

ధరలు పెంచి ప్రజలను లూటీచేస్తున్న ప్రభుత్వాలు

వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శివ నాగరాణి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శివ నాగరాణి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు మరోపక్క ధరలు పెంచి ప్రజల జేబులు లూటీ చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.450 ఉండే గ్యాస్ సిలెండర్ ధర రూ.1200 అయిందని, రూ.80 ఉండే నూనె ప్యాకెట్ ధర రూ.175కు చేరిందని అన్నారు. డ్వాక్రా గ్రూపులకు ఇస్తున్న రుణాలు విద్య, వైద్యం తదితర కుటుంబ అవసరాలకు ఖర్చయిపోతున్నాయని, పేద కుటుంబాలు అప్పులు పాలవుతున్నాయని పేర్కొన్నారు. పేదలకు సెంటు భూమిని ఇళ్ల స్థలాలుగా ఇవ్వడం అన్యాయమని, కనీసం ఐదు సెంట్ల భూమిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు చేసేవారికి చాలీచాలని కూలి ఇస్తున్నారన్నారు. రోజు కూలి రూ.600కు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పెద్దల చేతుల్లోకి అసైన్డ్, సముద్రతీర బంజరులు, లంకభూములు

వ్యకాస కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు

వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు మాట్లాడుతూ రాజకీయాల్లో నిరుద్యోగం, ఉపాధి, విద్య తదితర ప్రజా సమస్యలపై చర్చ లేకుండా పోయిందన్నారు. జిల్లాలో వేలాది ఎకరాల ఎస్సైన్డ్ భూములు, సముద్ర తీర బంజరులు, లంక భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయన్నారు. పెద్దల ఆక్రమణలో ఉన్న భూములు పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ చల్లపల్లి, మోపిదేవి, పామర్రు, నందివాడ మండలాల్లో భూ పోరాటాలు జరిగాయని గుర్తుచేశారు. ఉపాధి పనులు, భూసమస్య, దళితుల శ్మశాన వాటికలకు భూముల కేటాయింపు తదితర సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు.

పెద్దల చేతుల్లోకి వెళ్లిన అసైన్డు భూములను తిరిగి పేదలకు పంచాలి

వ్యకాస కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మురాల రాజేష్

వ్యకాస కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మురాల రాజేష్ మాట్లాడుతూ జిల్లాలో లక్ష ఎకరాల భూములు పెద్దల ఆక్రమణలో ఉన్నాయన్నారు. 9/77 చట్టం పటిష్టంగా అమలు చేసి పెద్దల చేతుల్లోకి వెళ్లిన ఎస్సైన్డ్ భూములను తిరిగి పేదలకు పంపిణీ చేయాలన్నారు.

ఉపాధి పని ప్రదేశాల్లో సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం

ఐద్వా కృష్ణాజిల్లా కార్యదర్శి జ్యోతి

ఐద్వా కృష్ణాజిల్లా కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ ఉపాధి పనులు చేసే మహిళలకు అవసరమైన సదుపాయాల కల్పనలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఉపాధి పని ప్రదేశాల్లో మౌలిక వసతుల కల్పనకు వ్యవసాయ కార్మిక సంఘంతో కలిపి ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.

వ్యకాస వ్యవస్థాపకుల్లో గుంటూరు బాపనయ్య ఒకరు

కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణ

కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపకుల్లో గుంటూరు బాపనయ్య ఒకరని గుర్తుచేశారు. వ్యకాస కృష్ణాజిల్లా అధ్యక్షులు డి.సంగీతరావు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు పాగోలు రమేష్ తదితరులు సభలో మాట్లాడారు.

పెండింగ్‌లో రెండు బ్యారేజీల అనుమతులు

చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఆర్వీ అసోసియేట్ ఆధ్వర్యంలో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)లు సిద్ధం చేశారు. ఆమోదం నిమిత్తం ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. అయితే ప్రస్తుత ధరలకు (ఎస్ఎస్ఆర్) అనుగుణంగా డిపిఆర్‌ను అప్‌డేట్ చేసి పంపాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఆమేరకు అధికారులు అప్‌డేట్ చేసి పంపారు. రెండు నిర్మాణాలకు సుమారు రూ.4వేల కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా వేశారు. దీనికి ప్రభుత్వం నుంచి పరిపాలనా పరమైన అనుమతులు లభించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే దానిని న్యాయ సమీక్షకు పంపడం, అనంతరం టెండర్లకు ప్రక్రియకు వెళ్లాలని అధికారులు భావిస్తున్నారు. నెల రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి పరిపాలనపరమైన అనుమతుల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ నిర్మాణాలపై పోరుగున ఉన్న తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ దిగువన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించనున్న రెండు బ్యారేజీలను అడ్డుకోవాలని పేర్కొంది. ఆ మేరకు ఎపి ప్రభుత్వంపై తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి)కి ఫిర్యాదు చేసింది. విభజన చట్టం ప్రకారం అపెక్స్ కౌన్సిల్, కేఆర్ఎంబి అనుమతి లేకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టడానికి వీల్లేదని, ప్రకాశం బ్యారేజీకి దిగువన ఎపి ప్రభుత్వం నిర్మించే ఆనకట్టలను నిలిపివేయాలని కోరింది. అయితేఇతే తెలంగాణ ప్రభుత్వం పెట్టిన అభ్యంతరాలు సీరియస్‌వి కాదని, సుముద్రంలో కలిసే నీటిని వినియోగించుకోవడం వల్ల తెలంగాణకు పెద్దనష్టం ఉండదని అధికారులు చెబుతున్నారు.

కారిడార్ పనులను పరిశీలించిన వీఎంసి కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : జాతీయ రహదారి రామవరప్పాడు రింగు నుంచి గన్నవరం విమానాశ్రయం వరకు చేపట్టిన కారిడార్ నిర్మాణ పనులను సోమవారం విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రసాదంపాడు వద్ద పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రూరల్ ప్రాంతంలో పారిశుధ్య పనులు సరిగా నిర్వహించాలని పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ
పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్


మాట్లాడతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)
జిల్లాలో పెండింగ్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం తన చాంబర్ లో జిల్లా ఎస్పీ పి. జాషువాతో కలసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ కేసులపై డివిజన్ల వారీగా డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు చార్జిషీట్లు పూర్తిచేసి త్వరితగతిన కేసు లను పరిష్కరించాలన్నారు. ఆయా కేసుల్లో కులదవీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదన్నారు. పెండింగ్లో ఉన్న కేసులకు గల కారణాలను డివిజన్ల వారీగా ఆయన అధికారులతో చర్చించారు. జిల్లాలో ఇప్పటి వరకు మచిలీపట్నం 10, గుడివాడ 13, గన్నవరం 16, అవనిగడ్డ 6, మచిలీపట్నం దిశా పోలీస్ స్టేషన్లో 2 మొత్తం కలిపి 47 కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉన్నాయని అన్నారు. 67 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో మొత్తం 84 మంది బాధితులకు రూ.64.05 లక్షల నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు. బందరు డివిజన్లో 30 మంది బాధితులకు రూ.28.45 లక్షలు, గుడివాడ డివిజన్లో 23 మందికి రూ.13.75 లక్షలు, ఉయ్యూరు డివిజన్లో 31 మందికి రూ.21.85 లక్షలు నష్టపరిహారం చెల్లించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ పి జాషువా, డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు డివిజన్ల ఆర్డీఓలు ఐ.కిషోర్, పి.పద్మావతి, విజయ్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.సరస్వతి, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి దూర్జటి ఫణి, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఒబిఎస్ టూల్స్‌పై వర్క్ షాప్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓబిఎస్ టూల్స్ పై ఒకరోజు వర్క్ షాప్ కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి పి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన నిర్వహించారు. మైలవరం ఎల్ ఆర్ బి ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సీనియర్ కంప్యూటర్ అధ్యాపకులు ఎంసిహెచ్ సాంబ శివరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఓబిఎస్ టూల్స్ ఉపయోగించి డిజిటల్ క్లాసులు నిర్వహణను వివరించారు.అలాగే జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఏ వీర కుమారి ఆధ్వర్యంలో ప్రపంచ మ దమేహ దినోత్సవం నిర్వహించారు. వేకనూరు ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ మండల రిషిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కే విశ్వేశ్వరరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి-ఘంటసాల
ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం కషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమం కెవికె ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. మచిలీపట్నం, కూచిపూడి, తోటమాల, బంటుమిల్లి, మొవ్వ తదితర గ్రామాలకు చెందిన మహిళలు, గ్రామీణ యువతకు వారం రోజులపాటు తేనెటీగల పెంపకంపై, తేనెటీగల పరిశ్రమలో పాటిం చవలసిన మెలకువలపై శిక్షణ కార్యక్రమాన్ని సస్యరక్షణ శాస్త్రవేత్త డా.రేవతి నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా తేనెటీగల పరిశ్రమ ద్వారా ఉపాధితోపాటు మంచి ఆదాయం పొందవచ్చునని కెవికే ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ డా.పి.శ్రీలత వివరించారు. కెవికె శాస్త్రవేత్తలు డా.మంజువాణి, డా.యశ్వంత్ కుమార్, డా.వెంకట లక్ష్మి, డా.బి.నవీన్ గ్రామీణ యువత పాల్గొన్నారు.

ఐదో రోజుకు రైతుల రిలే దీక్షలు


దీక్షల్లో కూర్చున రైతులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి,కత్తివెన్ను మండలాలకు దాళ్వాకు సాగునీరివ్వాలని కోరుతూ కృష్ణాజిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు చేస్తున్న రిలేనిరాహార దీక్షలు సోమవారంతో ఐదవ రోజుకు చేరాయి. రైతులకు సంఘీభావంగా పెడన నియోజవర్గం టిడిపి ఇన్చార్జ్ కాగిత కష్ణ ప్రసాద్, జనసేన పెడల నియోజకవర్గ ఇన్చార్జ్ సమ్మిటబాబు దీక్షలో పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కష్ణాజిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పుకునే వైసిపిప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని అన్నారు. పెడన నియోజవర్గం మొత్తం వ్యవసాయం మీద ఆధారపడి ఉందని వ్యవసా యానికి నీళ్లు లేవని చెప్పడం చాలా బాధాకరమన్నారు. దాళ్వా సాగుకు నీరివ్వకపోతే రైతులు వలసలు వెళ్లే పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండల అధ్యక్షుడు కార్యదర్శి మళ్లీ శెట్టి శివరాం ప్రసాద్, కత్తివెన్ను మండల అధ్యక్షులు పట్టపు ఏసుబాబు, బంటిమిల్లి మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ గోస్, శ్రీనివాసరావు, వంగల రాజు, కృత్తివెన్ను మండల రైతు సంఘం కార్యదర్శి బుద్ధన బాబి, పుప్పాల నరసింహారావు, పుప్పాల పాండురంగారావు, పాశం కోటయ్య, టిడిపి పార్లమెంట్ కార్యదర్శి సింగంశెట్టి శీను, బీసీ గౌడ్ అధ్యక్షుడు జొన్నలగడ్డ కొండల రావు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ అడ్వెంచర్ శిక్షణకు ఎంపిక



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్
కష్ణా యూనివర్సిటీ క్యాంపస్ కు చెందిన ఇంజనీరింగ్, ఆర్ట్స్ అండ్ సైన్స్, ఫార్మసీ కళాశాలల నుంచి మొత్తం 10 మంది ఒక ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.కవిత హిమాచల్ ప్రదేశ్ లో ఈనెల 15 నుండి 24 వరకు నిర్వహించే నేషనల్ అడ్వెంచర్ క్యాంపుకు ఎంపికయ్యారు. కేంద్రప్రభుత్వ ఆధీనంలోని యువజన విభాగం, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జరిగే ఈ జాతీయ శిక్షణా శిబిరం ఈ సంవత్సరం హిమాచల్ ప్రదేశ్ , నార్కండ లోని అటల్ బిహారీ వాజ్ పేయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ స్పోర్ట్స్ లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి శిక్షణ ఇవ్వడానికి గాను ఆంధ్రప్రదేశ్ లోని 2 యూనివర్సిటీల నుండి మాత్రమే విద్యార్థులను ఎంపిక చేయగా అందులో ఒకటి కష్ణా యూనివర్సిటీ కావడం విశేషం అని వర్సిటీ ఉపకులపతి, ఎన్ఎస్ఎస్ చైర్మన్ ఆచార్య కె బి చంద్రశేఖర్ తెలిపారు. వర్సిటీ ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త మరియు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం బాబు రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి అరుదైన అవకాశం చాలా తక్కువ మందికి వస్తుందని,దీన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఉన్నత వ్యక్తి గోగినేని శ్రీశైలం


శ్రీశైలం మాస్టార్ని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గన్నవరం
ఎంతో ఉన్నతమైన వ్యక్తి గోగినేని శ్రీశైలం అని వికెఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి అన్నారు. సోమవారం గన్నవరం మండలం ముస్తాబాద జిల్లా పరిషత్ హైస్కూలులో కష్ణాజిల్లా ప్రముఖ వ్యాయామోపాధ్యాయులైన గోగినేని శ్రీశైలం మాస్టారుకు సన్మానం జరిగింది. ఈ సందర్భంగా స్వర్ణకుమారి మాట్లాడుతూ.. 1953 నుండి 1989 వరకు 36 సంవత్సరాల పాటు కష్ణాజిల్లాలోని వీరవల్లి , ఇందుపల్లి , ముస్తాబాద్, జగ్గయ్యపేట హైస్కూళ్ళ నందు డ్రిల్లు మాస్టారుగా శ్రీశైలం అంకిత భావంతో పనిచేసినట్లు తెలిపారు. ప్రతిచోటా విద్యార్థుల మీద తనదైన ముద్రవేసి , విద్యాభ్యాసంలో ఎంతో ముఖ్యమైన క్రీడలలో విద్యార్థులను తీర్చిదిద్ది, 93 సంవత్సరాలు నిండు జీవితంలో స్వగ్రామమైన లంకపల్లిలో (ఉంగుటూరు మండలం) సేదతీరుతున్న శ్రీ గోగినేని శ్రీశైలం కు 1958-61 ల మధ్య వారు పనిచేసిన ముస్తాబాద జిల్లా పరిషత్ హైస్కూల్లో పూర్వ విద్యార్థులచే సన్మానం చేసి గౌరవించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లంపాటి వెంకటసుబ్బారావు, ప్రముఖ వ్యక్తి మద్దుకూరి విజయ్ కుమార్, పెద్దలు ఎం. లక్ష్మణరావు , ఫిజికల్ డైరెక్టర్ కె.వి. రామారావు , ఫిజికల్ డైరెక్టర్ కె . లోహిత్ , స్కూల్ విద్యార్థి సంఘ అధ్యక్షుడు పూర్వ విద్యార్థుల తరుపున డాక్టర్ మద్దుకూరి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణంపై రాజకీయం తగదు : మంత్రి


మంత్రికి సమస్యలు విన్నవిస్తున్న మహిళ

ప్రజాశక్తి పెడన
జగనన్న ప్రభుత్వం ఎంతో ప్రతిష్టా త్మకంగా చేపడు తున్న ఇళ్ల నిర్మాణాన్ని రాజ కీయం చేయాలని కొందరు కుట్రలు పన్నుతు న్నారని, ప్రజలే వారి తీరుని అసహ్యిం చుకుం టున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. సోమవారం ఆయన పెడన మున్సిపాలిటీ నాలుగవ సచివాలయం పరిధిలోని 11వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 21 నాటికి గహప్రవేశాలకు అనువుగా విద్యుత్ సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, తాగునీటి వసతి తదితర మౌలిక సదుపాయాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెడన మునిసిపల్ ఛైర్మెన్ బళ్ళా జ్ఞాన లింగ జ్యోత్స్నా రాణి, వైస్ ఛైర్మెన్ ఎం.డి. ఖాజా, 11 వ వార్డు కౌన్సిలర్ మల్లా కోటమ్మా , 3 వ వార్డు కౌన్సిలర్ బళ్ళా గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత మహిళా కబడ్డీ పోటీలకు గౌసాని ఎంపిక


షేక్ గౌసాని

ప్రజాశక్తి-గన్నవరం :
అఖిలభారత ప్రభుత్వ ఉద్యోగుల జాతీయ మహిళా కబడ్డీ పోటీలకు గన్నవరం చైతన్య స్పోర్ట్స్ క్లబ్ కు చెందిన షేక్ గౌసాని ఎంపికైనట్లు కబడ్డీ శిక్షకులు చైతన్య స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ధనియాల నాగరాజు సోమవారం తెలిపారు. కబడ్డీ రాష్ట్ర జట్టుకు తుది ఎంపికకు హాజరైన గౌసాని తనదైన శైలిలో క్రీడా నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. డిసెంబరు లో సిమ్లానందు జరగబోయే అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల మహిళా కబడ్డీ పోటీలలో గౌసాని రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తుందని ఆయన తెలిపారు. గతంలో జాతీయ ,రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని రాణించిన గౌసాని ప్రస్తుతం కంకిపాడు మండలం తెన్నేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. గౌసాని జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి -కలెక్టరేట్ (కృష్ణా)
ఇటీవల సౌదీ అరేబియాలోని రియాద్ నగరంలో ప్రమాదవశాత్తు మరణించిన మతుని భార్యకు రూ.8.42 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అందజేశారు. సోమవారం తన చాంబర్లో మతుని భార్య అయిన నూతక్కి నాగలక్ష్మికి కలెక్టర్ ఈ చెక్కును అందించారు. నాలుగు సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియాలోని రియాద్కు వెళ్లిన పెనమలూరు మండలం, తాడిగడపకు చెందిన నూతక్కి నరేష్ జూలై 27న ప్రమాదవశాత్తు మరణించారు. పనిచేసే సమయంలో నరేష్ దాచుకున్న సొమ్మును సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయం పంపిన చెక్కును పెనమలూరు మండలం, తాడిగడపలో నివాసం ఉంటున్న మతుని భార్య నూతక్కి నాగలక్ష్మికి కలెక్టర్ అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు కలెక్టర్‌తో పాటు ఉన్నారు.

మధుమేహంపై అవగాహన అవసరం

రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్



ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: మధుమేహం ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా ఉందని, ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రతి పది మంది వయోజనులలో ఒకరిలో ప్రమాదకర స్థాయికి చేరుకుందని రాష్ట్ర గవర్నర్ మాననీయ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. వ్యాధి సోకిన వారిలో సగం మందికి మధుమేహం ఉందని కూడా తెలియదన్నారు. విజిఆర్ డయాబెటీస్ ఎడ్యుకేషన్, అవేర్‌నెస్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ మధుమేహ దినోత్సవ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరవ హరిచందన్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు భారతదేశంలోనే ఉన్నారని, వారి సంఖ్య చాలా వేగంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసారు. తగిన ప్రచారం ద్వారా నివారణ, సంరక్షణలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మధుమేహం రాకుండా ఎలా నివారించాలో ప్రజలకు తెలియచెప్పాలన్నారు. సరైన ఆరోగ్య, మౌలిక సదుపాయాలు లేకపోవడం, అక్షరాస్యత రేటు తక్కువగా ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతాలపై ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. స్థానిక భాషలో ప్రచురణలను ముద్రించి ప్రజలకు పంపిణీ చేయాలని గవర్నర్ అన్నారు. ఈ సందర్భంగా వివిధ వైద్య విభాగాలలోని సీనియర్ వైద్యులను గవర్నర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు, యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఉపకులపతి డాక్టర్ శ్యామ్ ప్రసాద్, రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎ.శ్రీధర్ రెడ్డి, బిజెపి నేత పాతూరి నాగభూషణం, ఇండియన్ సైకియాట్రిక్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



25 వేల మందితో ఆరోగ్య ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: కరెన్సీనగర్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పటల్‌సన 25వేల మంది చిన్నారులతో ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించినట్లు హాస్పటల్ రీజనల్ మేనేజర్ రావి శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై అవగాహణ కల్పించాలనే ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆరోగ్యంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. 25 వేల మంది విద్యార్థులు తమ పాఠశాలల్లో సోమవారం ఉదయం ఏకకాలంలో 'నేను శుభ్రత పాటిస్తూ, పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.. నేను త్వరగా నిద్రపోయి ఉదయాన్నే లేస్తానని వ్యాయామం చేస్తూ తోటి పిల్లలతో ఆరు బయట ఆటలాడతానని ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు. అన్ని రకాలైన కూరగాయలు, పండ్లతో సమతుల ఆహారం తీసుకుంటానని, నా ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటూ సంతోషంగా ఉంటానని' ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు.




ఆఫర్డ్ ప్లాన్‌తో కామినేని ఆసుపత్రి భాగస్వామ్యం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ

ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా నగరంలోని కామినేని హాస్పటల్స్, గురుగ్రామ్‌కు చెందిన ఆరోగ్య సంరక్షణ ఫైనాన్స్ ఫ్లాట్‌ఫామ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఆసుపత్రి సీవోవో డాక్టర్ నవీన్ తెలిపారు. నగరంలోని ఆసుపత్రి ప్రాంగణంలో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు సోమవారం ఆఫర్డ్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ నవీన్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ ఫైనాన్స్ ఫ్లాట్‌ఫామ్ అయిన ఆఫర్డ్ ప్లాన్ స్వాస్థ్ అనేది ఒపిడి, ల్యాబ్ టెస్టులు, మందుల కొనుగోలు చెల్లింపులకు అన్ని ఇన్‌పేషంట్ ట్రీట్‌మెంట్స్‌కు ఈఎంఐ ద్వారా చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడంలో కామినేని హాస్పటల్స్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమమంలో కామినేని ఆసుపత్రి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ, ఆఫర్డ్ ప్లాన్ బిజినెస్ హెడ్ పిఆర్ఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-మైలవరం: లీగల్ లిటరసి డే సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి సోమవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జడ్జీ షేక్ షీరీన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ముల్లంగి రవికుమార్, ఎంఇఒ రత్నశ్యామ్‌బాబు పాల్గొన్నారు.



శైవక్షేత్రాలకు ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు : ఆర్‌ఎం

ప్రజాశక్తి-విజయవాడ: శైవక్షేత్రాల ప్రత్యేక ఆర్‌టిసి బస్సులకు అంచనాకు మించిన స్పందన వస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి (ఆర్‌ఎం) యంవై దానం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ...కార్తీక మాసాన్ని పురస్కరించుకొని యాత్రికుల సదుపాయం కోసం ప్రముఖ శైవక్షేత్రాలకు, ఇతర పుణ్యక్షేత్రాలకు ఆర్టీసి సర్వీసులను నడుపుతున్న విషయం తెలిసిందేనన్నారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకు 113 సర్వీసులను నడపడం జరిగిందన్నారు. పంచారామాలు 56 బస్సులు, అరుణాచలం నాలుగు, త్రిలింగదర్శిని ఆరు, శ్రీశైలం 19, అన్నవరం ఆరు, ఇతర శైవక్షేత్రాలకు మరో 22 సర్వీసులను నడపడం జరిగిందన్నారు. మరో పది రోజుల్లో కార్తీక మాసం ముగుస్తున్నందున యాత్రికులు ఆర్టీసి ఏర్పాటు చేసిన ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎం విజ్ఞప్తి చేశారు. శైవక్షేత్రాలకే కాకుండా శబరిమలై యాత్రకు, మంగినపూడి బీచ్, సూర్యలంక బీచ్, పర్ణశాల తదితర ఇతర ముఖ్య పుణ్యక్షేత్రాలకు , వనభోజనాలకు వెళ్లదలిచిన వారు 40/36 మంది ఒక బృందంగా వచ్చినట్లయితే వారుకోరిన ప్రదేశాలకు , వారు కోరిన తేదీల్లో నివాసాల నుంచే సరసమైన ధరలలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయబడుతాయని ఆర్‌ఎం తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9959225475కు ఫోన్ చేసి సమీప డిపో మేనేజర్‌ను సంప్రదించాలని కోరారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని సెర్ఫ్ సీఈవో, మైనారిటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ.ఎం.డి.ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం దర్సగ ఇస్లామీ స్కూల్‌లో జరిగింది. ఇంతియాజ్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో రాణించాలనుకునే వారికి ప్రభుత్వం పలు రకాలైన ప్రోత్సాహకాలు అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన పోటీలలో సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. మునీర్ ఫౌండేషన్ నిర్వాహకులు మునీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అయితే పేదరికం కారణంగా చదివించలేని తల్లిదండ్రులకు ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమి డైరెక్టర్ ఎన్.అయూబ్ హుస్సేన్, ముజాహిద్ ఉమ్రి పాల్గొన్నారు.

రూ.499కే సెంటినీలో హార్టు చెకప్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

నగరంలోని సెంటినీ హాస్పటల్స్‌లో ప్రత్యేక హార్టు చెకప్ ప్యాకేజిని ప్రారంభించినట్లు హాస్పటల్ సిఇవో సి.ఎల్.ఎన్.రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెంటినీ హాస్పటల్స్ నందు అన్ని రకాలైన వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ అధ్యయనాల ప్రకారం శీతాకాలంలో గుండెపోటు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకమైన హార్టు ప్యాకేజీని రూపొందించినట్లు తెలిపారు. రూ.499కు ఈసిజి, 2డి ఎకోతో పాటు సీనియర్ కార్డియాలజిస్టు కన్సల్టేషన్ అందిస్తున్నామన్నారు. అలాగే యాంజియోగ్రామ్ రూ..3999లకే అందిస్తున్నా మని తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 14వ తేదీ నుండి డిసెంబరు 15వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. వివరాలకు 9010726666 ఫోన్ నెంబరు ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-మైలవరం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ద్యేయమని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని చంద్రగూడెం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు వైఎస్సార్ జలకళను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జలకళ పథకం ద్వారా నీటి పారుదల సక్రమంగా లేని ప్రాంతాల్లో మెట్టభూముల రైతుల కోసం ఉచితంగా బోర్లు వేస్తున్నామన్నారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకుమారి, ఎంపీపీ ప్రస్నన్నరాణీ, జెడ్పీటీసీ తిరుపతిరావు, వైసీపీ మండల అధ్యక్షులు గర్నేపూడి వెంకట్రావు, చంద్రగూడెం పీఏసీఎస్ అధ్యక్షులు శీలం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

మణిపాల్ ఆసుపత్రిలో విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: బాలల దినోత్సవం సందర్భంగా మణిపాల్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో పుట్టుకతో మూగ, చెవుడుతో బాధపడుతున్న చిన్నారులకు, క్యాన్సర్‌తో పోరాడుతున్న పిల్లలకు ఆటల పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలైన చిన్నారులకు బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా మణిపాల్ హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ చాలా మంది పిల్లలు పుట్టుకతోనే మూగ, వినికిడి సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ కారణంగా వారు మాట్లాడలేకపోతున్నట్లు తెలిపారు. ఇటువంటి పిల్లలకు సామాజిక బాధ్యతగా మణిపాల్ హాస్పటల్ ముఖ్యమంత్రి స హాయ నిధి, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం సహాయంతో ఉచితంగా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా చిన్న పిల్లల్లో క్యాన్సర్ బూతంగా మారి వారి జీవితాలను అంధకారంలోకి నెడుతున్నట్లు తెలిపారు. అటువంటి వారికి జీవితంపై ఆశ చిగురింపచేసేవిధంగా మానసిక పరివర్తన తీసుకుని రావడమే లక్ష్యంగా ఈకార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

